క్లుప్తంగా

ఇంటింటా అయోధ్య అక్షతల పంపిణీ



జోగిరాజుపేటలో అయోధ్య అక్షతలు పంపిణీ చేస్తున్న శ్రీరామ భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని జోగిరాజుపేట గ్రామంలో ఇంటింటా అయోధ్య అక్షతల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా రామాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీరామ భక్త జన బృంధం సభ్యుల ఆధ్వర్యంలో అయోధ్య నుంచి తెచ్చిన అక్షతలను కలశాలతో ఊరేగించారు. కోలాటాలు, చెక్క భజనలతో, శ్రీరామ నామాన్ని జపిస్తూ ఇంటింటికీ వెళ్లి పవిత్ర అక్షతలను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో మత్స శ్రీనివాసరావు, శ్రీరామ భక్తులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు గర్వకారణం



మాట్లాడుతున్న టూరిజం బోర్డు డైరెక్టర్ శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేయడం దేశానికే గర్వకారణమని ఏపీ టూరిజం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సీతారామునిపేట గ్రామంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా 125 అడుగుల భారీ విగ్రహం ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని, అటువంటి మహనీయుడి విగ్రహాన్ని నెలకొల్పడం చరిత్రలో మైలు రాయిగా నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారికి కుంకుమ పూజలు



రాజరాజేశ్వరిదేవికి పూజలు చేస్తున్న భక్తులు

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామంలో రాజరాజేశ్వరిదేవి ఆలయంలో మంగళవారం కనుమ సందర్భంగా కుంకుమ పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు దూసి శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అయోధ్య అక్షతలకు పూజలు



అయోధ్య అక్షతలకు పూజలు చేస్తున్న భజన మండలి సభ్యులు

బొండపల్లి: మండలంలోని రోళ్లవాక గ్రామంలోని రామాలయంలో అయోధ్య రామాలయం నుంచి తీసుకొచ్చిన అక్షతలకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాటిని ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ నెల 22 అయోధ్య రామాలయం ప్రాణప్రతిష్ట సందర్భంగా రామాలయం చిత్రపటాన్ని భజన మండలి ఆధ్వర్యంలో ఊరేగించారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు



పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి

జామి: మండలంలో అన్నంరాజుపేట పంచాయతీ పుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయంలో సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఫణిహారం సీతరామాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

సందడిగా సంక్రాంతి

- పల్లెల్లో సంక్రాంతి శోభ
- సంబరాల్లో పల్లె ప్రజలు



నెల్లిమర్ల రూరల్: ఏటీ అగ్రహారం గ్రామ శివారులో తలపడుతున్న పందెం కోళ్లు

నెల్లిమర్ల రూరల్: మకర సంక్రాంతి సందర్భంగా పల్లెలన్నీ కళకళలాడాయి. అన్ని వర్గాల ప్రజలూ నూతన వస్త్రాలు ధరించి తమ ఇలవేల్పుకు, పూర్వీకులకు నూతన వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు. ఇంటి ముంగిట అందంగా ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి, పాడి పశువులకు సైతం పూజలు చేశారు. ముత్తయిదువులకు వాయినాలు అందించి తమ సాంప్రదాయాలను కొనసాగించారు. అనంతరం ఆడపడుచులు, అల్లుళ్లు, వారి పిల్లలతో ఆనందంగా గడిపారు. పెద్ద, చిన్న తేడా లేకుండా అందరూ ఒకే చోట చేరి సంతోషాల నడుమ సంక్రాంతి, కనుమ పండగలను జరుపుకున్నారు. చిన్నారులైతే పతంగులను ఎగురవేస్తూ కేరింతలు కొట్టారు. సంక్రాంతిని పురస్కరించుకొని వల్లూరు, అలుగోలు, ఒమ్మి, సతివాడ, సారిపల్లి, చినబూరాడపేట గ్రామాల్లో రంగవల్లులు, క్విజ్ తదితర పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. పలు గ్రామాల్లో కోడి పందాలు జోరుగా సాగాయి. కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు, యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సందడిగా సంక్రాంతి

డెంకాడ: సంక్రాంతి పండగను గ్రామాల్లో సందడిగా నిర్వహించారు. డెంకాడ మండల వ్యాప్తంగా సంక్రాంతి పండగను పెద్ద, చిన్న మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. పల్లెల్లో చిన్న పండగ పేరుతో మంగళవారం మెజార్టీ కుటుంబాలు సంక్రాంతి పండగను నిర్వహించారు. భోగి రోజు పల్లెల్లో ప్రారంభమైన సందడి సంక్రాంగి, కనుమ రోజు మంగళవారం వరకు కొనసాగింది.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

విజయనగరం: నగరంలోని శ్రీసాయికృష్ణ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించుకునే పండగలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మంగళవారం క్లబ్ గోల్డ్ డోనర్ పిన్నింటి సూర్యనారాయణ బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలు భావితరాలకు తెలియజెప్పేందుకు సంక్రాంతి సంబరాలు వంటి వేడుకలు దోహదపడతాయని పేర్కొన్నారు. ముగ్గులు పోటీల్లో సుమారు 50 మంది చిన్నారులు, మహిళలు పాల్గొనగా, మొదటి, ద్వితీయ, తృతీయ విభాగాల్లో గెలుపొందిన మహిళలకు బహమతులు అందజేశారు. క్లబ్ గౌరవ సలహాదారులు ఎ.తిరుపతిరావు, క్లబ్ కార్యదర్శి ఐ.వి.ప్రసాదరావు, మాజీ కోశాధికారి గోవిందరావు, క్లబ్ జాయింట్ సెక్రటరీ వై.నలమహారాజు, క్లబ్ పీఆర్ఓ ములగ శ్రీనివాసరావు, సీనియర్ సభ్యులు రమేష్ బాబు, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల రూరల్: బూరాడపేటలో ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మెన్ పైడినాయుడు తదితరులు



పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న క్లబ్ సభ్యులు

ఘనంగా గోపూజోత్సవం



గోమాతకు పూజలు నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్ రెడ్డి

విజయనగరం టౌన్: టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో మంగళవారం గోపూజోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. టీటీడీ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ జె.శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవును పూజిస్తే సకల దేవతలను పూజించినట్లేనని పేర్కొన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని గోవులకు పూజలు చేసి, ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. స్థానిక కంటోన్మెంట్ గూడ్స్ షెడ్ వద్దనున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో గోపూజోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఆలయ కమిటీ ట్రస్ట్ చైర్మన్ రెయ్యి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. సకల దేవతల సమాహారం గోమాతని, ప్రత్యక్ష్యంగా దేవతలకు పూజలు చేసినట్లేనని తెలిపారు. పసుపు, కుంకుమలను సమర్పించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

- ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: ప్రమాద రహిత రవాణా కోసం డ్రైవర్లు బాధ్యతగా పని చేయాలని ఆర్టీసీ డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీలో రోడ్డు భద్రతా వారోత్సవాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు విధుల నిర్వహణకు వచ్చే ముందు మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలని అన్నారు. సంస్థ అందిస్తున్న నిరంతర శిక్షణను సద్వినియోగం చేసుకొని ప్రమాద రహిత సేవలను అందించాలని కోరారు. అనంతరం పక్షోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ బి.ఆదినారాయణ, మెకానికల్ ఇన్‌చార్జ్ ఎస్.హేమంత్ కిషోర్, డిపో సీహెచ్.రవికుమార్, డిపో సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిపో మేనేజర్ శ్రీనివాసరావు

సేవలతోనే గుర్తింపు

బొండపల్లి: ఏ రంగంగలో పనిచేస్తున్న వారికైనా ఆయా రంగాల్లో వారందించిన సేవలే వారికి గుర్తింపునిస్తాయని ట్రైనీ డీఎస్పీ ఎస్.మహేంద్ర అన్నారు. మండలంలోని నెలివాడ గ్రామంలో బొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ ఎడ్యుకేటర్‌గా పనిచేస్తున్న మాచర్ల గోపిని మంగళవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ గత 25 ఏళ్లుగా రోగులకు సేవలందిస్తూ, వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గోపిని అభినందించారు. ప్రతి ఒక్కరూ ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ తాళ్లపూడి కీర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు తాళ్లపూడి అప్పలనాయుడుతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



హెల్త్‌ఎడ్యుకేటర్ గోపిని సత్కరిస్తున్న ట్రైనీ డీఎస్పీ మహేంద్ర

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన

కొత్తవలస: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత అన్నారు. మండలంలోని ముసిరాం గ్రామంలో సోమవారం ఆమె పర్యటించారు. ఈ నెల 19న విజయవాడ స్వరాజ్ మైదానంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య ఫలాలు బడుగు, బలహీన వర్గాలకు అందాలన్న అంబేడ్కర్ ఆశయానికి అనుగుణంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర బీసీ సంఘం ప్రెసిడెంట్ పిల్లి నూకరాజు, యాత కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దమ్ము రమణ, తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే
సీఎం జగన్ అజెండా

రాజాం: రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అజెండా అని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండలంలోని కంచరాం గ్రామంలో విజయవాడలో ఈ నెల 19వ తేదీన జరిగే 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు సంబంధించి, పోస్టర్ల పంపిణీ మంగళవారం చేపట్టారు. తొలుత ఆయన గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళలర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా సీఎం జగనన్న పాలన కొనసాగుతోందని, అన్నివర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. విజయవాడలో జరిగే అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు భారీగా ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, యూత్ అధ్యక్షుడు గెడ్డాపు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



రాజాం: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

రాజేష్‌కు జీఎంఆర్ అభినందన

రాజాం: వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ కుటుంబ సమేతంగా రాజాం పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త గ్రంధి మల్లిఖార్జునరావు(జీఎంఆర్)ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జీఎంఆర్ ఐటీ మైదానంలో పేదలకు వస్త్రదానం చేసేందుకు విచ్చేసిన జీఎంఆర్‌ను రాజేష్ కలిసి, తనకు ఇన్‌చార్జ్ పదవి వచ్చిన విషయాన్ని తెలిపారు. వెంటనే స్పందించిన జీఎంఆర్ రాజేష్‌ను అభినందించడంతో పాటు గతంలో జీఎంఆర్ కేర్ ఆస్పత్రిలో డాక్టర్‌గా రాజేష్ చేసిన సేవలను ప్రశంసించారు. ప్రజాసేవలో కూడా వెలుగొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవీలత, వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్‌ను అభినందిస్తున్న జీఎంఆర్

ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వరస్వామి

మెంటాడ: స్థానిక శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని స్వామి వారు ప్రత్యేకాలంకరణలో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని, స్వామి వారిని నృసింహస్వామిగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ఏడాది పొడవునా భక్తులకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆలయ ప్రధానార్చకులు పీసపాటి కృష్ణమాచార్యులు స్వామి వారికి పూజలు చేశారు.



నృసింహస్వామి అలంకరణలో వేంకటేశ్వరస్వామి

నిర్మానుష్యం



నిర్మానుష్యంగా గంటస్తంభం రోడ్డు

విజయనగరం జిల్లా కేంద్రం సంక్రాంతి పెద్ద పండగ నేపథ్యంలో నిర్మానుష్యమైంది. ఒక్క సినిమా హాళ్ల వద్ద తప్ప మిగతా ప్రాంతాలు జనం రద్దీ లేక రోడ్లన్నీ బోసిపోయాయి. సంక్రాంతి పండగ కోసం సొంతూళ్లకు అంతా తరలి వెళ్లడంతో రోడ్లపై రద్దీ తగ్గింది. నిత్యం రద్దీగా గంటస్తంభం రోడ్డు, వైఎస్సార్ సర్కిల్, రైల్వేస్టేషన్ రోడ్డు, అంబేడ్కర్ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాలు జనం లేక వెలవెలబోయాయి. కనుమ రోజున సినిమాహాళ్లు, మాంసం దుకాణాల వద్ద రద్దీ కనిపించింది. మిగతా ప్రాంతాలు బోసిపోయాయి. ప్రజలంతా దూర ప్రాంతాల నుంచి వచ్చే కుటుంబ సభ్యులతో ఇళ్లల్లో కాలం వెళ్లదీయడంతో రోడ్లు నిర్మానుష్యమయ్యాయి.

– సాక్షి ఫొటో గ్రాఫర్, విజయనగరం



వైఎస్సార్ సర్కిల్ రోడ్డు



ఆర్టీసీ కాంప్లెక్సు రోడ్డు



రైల్వేస్టేషన్ రోడ్డు



అంబేద్కర్ జంక్షన్

ఘనంగా మంగమ్మ పేరంటాల జాతర



రాజాం: బొద్దాంలో మంగమ్మతల్లి పేరంటాలుకు మొక్కులు చెల్లిస్తున్న ఉత్తరాంధ్ర రజకకుల సంక్షేమ సంఘ సభ్యులు

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలో మంగమ్మ పేరంటాలు జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన రజకుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఘటాలు ఊరేగించి, అమ్మవారికి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.